క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్

భద్రాచలం: మణుగూరు (మిట్టగూడెం)లో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతంపోట్రు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సర సీట్లకు ఈ నెల 20వ తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగనుందని, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ధ్రువపత్రాలతో కళాశాలలో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వారి జాబితాను ఈ నెల 21న వెల్లడించనున్నట్లు తెలిపారు.

అశ్వారావుపేటరూరల్: డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.రోజా కోరారు. మండలంలోని పెదవాగు ప్రాజెక్టు గ్రామంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో బీఏ, బీకాం(సీఏ), బీజెడ్‌సీ, ఎంపీసీ గ్రూపుల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ/ఈబీసీ కేటగిరి విద్యార్థులకు సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సరిఫికెట్లతో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.200 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

చెక్కు అందజేత

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన సున్నం బాబురావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించారు. బాబురావు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో.. ఆయన మరణానంతరం పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సంబంధిత ఎఫ్ఆర్ కాపీలు, పోస్టుమార్టం రిపోర్టులను పార్టీ ఇన్సూరెన్స్ విభాగానికి పంపించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2లక్షల ప్రమాదబీమా చెక్కును సోమవారం ప్రభుత్వవిప్ రేగా కాంతారావు చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అడపా అప్పారావు, కార్యదర్శి బొలిశెట్టి నవీన్, నాయకులు యాదగిరిగౌడ్, తాతా రమణ, ముద్దంగుల కృష్ణ, శ్రీనివాస్, వట్టం రాంబాబు పాల్గొన్నారు.

టెండర్లు రద్దు చేయాలి

భద్రాచలం: ఐటీడీఏలో నియమ నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరులకు కేటాయించిన టెండర్లను రద్దు చేయాలంటూ సేవాలాల్ సేన జిల్లా ఇన్‌చార్జ్‌లు శివనాయక్, నాగేంద్రలు డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ ఎదుట జరిగిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. ఐటీడీఏలో టెండర్ల కేటాయింపులు అనేక అవకతవకలు జరిగాయని, వీటిపై ఐటీడీఏ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవకతవకలపై పీవో తక్షణమే విచారణ జరిపించి, దీని వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రాందాస్ నాయక్, కోటి, రామ్ కిషోర్, కృష్ణ, మురళీకృష్ణ, అరుణ్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

దుమ్ముగూడెం: మండలంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆపై తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ, మర్మం చంద్రయ్య, కొరస చిలకమ్మ, బొల్లి సూర్యచంద్రరావు, యలమంచి శ్రీనుబాబు, మర్మం సమ్మక్క, సర్పంచ్‌లు మీడియం జయ, కల్లూరి దేవి, తోడం తిరుపతిరావు, ఉప సర్పంచ్ వాగే ఖాదర్ బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

చర్ల: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, పెండింగ్ ఉన్న పోడుభూములకు హక్కుపత్రాలివ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో చర్లలో భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ బి.భరణిబాబుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి కారం నరేష్ మాట్లాడారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవలు విస్తరింపజేయాలి

అశ్వాపురం: లయన్స్‌క్లబ్ అశ్వాపురం సేవలు గ్రామ గ్రామానా విస్తరించి నిరుపేదలను ఆదుకునే కార్యక్రమాలు నిర్వహించాలని మణుగూరు భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే అన్నారు. లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా సర్వేశ్వరరావు, కార్యదర్శిగా భూక్యా దేవేందర్, కోశాధికారిగా ఒగ్గె వీరభద్రరావు, ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి జీఎం కేవీ.థాలే హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు.ఇన్స్‌టలేషన్ ఆఫీసర్‌గా ధార కృష్ణారావు, ఇండక్షన్ ఆఫీసర్‌గా అమృతవల్లి కోటేశ్వరరావు, సుంకరి సురేందర్, రాజయ్య, లయన్స్‌క్లబ్ సభ్యులు గాదె కేశవరెడ్డి, కమటం నరేష్, మంతెన రత్నాకర్, సజ్జా శ్రీను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బడి బస్సులు భద్రమేనా..?

- కాలం చెల్లిన వాహనాలతో నెట్టుకొస్తున్న పాఠశాలలు
- ఫిట్‌నెస్‌పై దృష్టి సారించని అధికారులు
- యాజమాన్యాల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆగ్రహం



మణుగూరురూరల్: బడులు ప్రారంభమై పదిహేను రోజులు అవుతోంది. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల అడ్మిషన్ల కోసం గ్రామాల వెంట పడి.. నాణ్యమైన విద్య, బస్ సౌకర్యం, ఫీజుల తక్కువ అంటూ తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నారు. పిల్లలను రవాణా చేసేందుకు పాత బస్సులకు రంగులు అద్ది సిద్ధం చేశారు. ఆ బడి బస్సులు ఎంతవరకు భద్రమనేది పలువురి మదిలోని ప్రశ్న.

నిర్లక్ష్య ధోరణిలో యాజమాన్యాలు..

కొన్ని పాఠశాలల యాజమాన్యాలు అనైతిక విధానాలను అవలంబిస్తూ.. నిబంధనలకు తూట్లు పొడుస్తున్నాయి. ఈ నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని బస్సుల కండీషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుని ఫిట్‌గా ఉండేలా చూసుకోవాల్సిన ఉంటుంది. బస్సులకు మరమ్మతులు చేయించి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించిన తరువాతే రోడ్డుపైకి ఎక్కించాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇబ్బందులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎప్పుడైనా అనుకోని ప్రమాదం జరిగితే.. పిల్లలకు ఏమైనా అయితే.. ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు.. బస్ ఫీజులను కూడా ఏ ఏడాదికి ఆ ఏడాది పెంచేస్తున్నారు. తల్లిదండ్రులపై తలకు మించిన భారం పెడుతున్నారు. ఈ విషయంలో ఇంత నిక్కచ్చిగా ఉన్న యాజమాన్యాలు బస్‌ల ఫిట్‌నెస్, ఇతర నిబంధనలు పాటించడంతో ఎందుకు ముందుండడం లేదో వారి నైతికతకే తెలియాలి.

పట్టించుకోని అధికారులు..

ప్రతీ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే రోడ్డు రవాణాశాఖ అధికారులు పాఠశాలల బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ ఉందా..లేదా? అనే సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ పాఠశాలలు ప్రారంభమై పదిహేను రోజులు కావస్తున్నా.. నేటి వరకు సంబంధిత అధికారులు బస్సుల ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టకపోవడంపై ఆరోపణలు వెవెల్లువెత్తుతున్నాయి. అయితే బస్సుల తనిఖీ విషయంలో రవాణాశాఖ అధికారులకు మామూళ్లు ముడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలల బస్సుల పని తీరుపై రవాణాశాఖ అధికారులు, అధిక ఫీజులపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో పలు ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న ప్రమాదాల వల్ల పిల్లలను బస్సుల్లో పంపించాలంటే భయాందోళన చెందుతున్నాం. పిల్లల భద్రత దృష్ట్యా బస్సుల ఫిట్‌నెస్‌పై సంబంధిత రవాణా శాఖ అధికారులు దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలి.

– ప్రేమ్‌కుమార్, రాజుపేట

చర్యలు తీసుకోవాలి

బస్సుల్లో పిల్లలను పాఠశాలలకు పంపుతున్న తల్లిదండ్రులు వారు ఇంటికి చేరుకునే వరకు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కండీషన్, ఫిట్‌నెస్‌లేని బస్సులను నడుపుతున్న పాఠశాలల యాజమాన్యాలపై జిల్లా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కోటా గణేష్, సుందరయ్యనగర్

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏపీవో భీమ్

భద్రాచలం: ఆదివాసీ విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న విద్యావకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత విద్యలో శిఖరాలను అధిరోహించాలని ఐటీడీఏ అడ్మినిస్ట్రేటివ్ అధికారి భీమ్ అన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఆరు, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో అధిక మార్కులను సాధించిన కొండరెడ్ల బాలబాలికలకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ సమావేశపు మందిరంలో జరిగిన కార్యక్రమంలో భీమ్ మాట్లాడారు. అశ్వారావుపేట మండలం బండారు గుంపుకు చెందిన అక్షయ రెడ్డికి రూ.5 వేలు, రెడ్డిగూడెంకు చెందిన తేజస్విని, సీహెచ్ మహేశ్వరిలకు రూ.5 వేలు, చిప్పాల వైశాలి, రేణుక, అరుణ, బుజ్జి, ధనలక్ష్మి, గాయత్రి, రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి, సంతోష్ లకు పదివేల రూపాయల చొప్పున అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అనసూయ రెడ్డి, సూర్యకాంతం, విద్యార్థినీలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

ఐటీడీఏలో సోమవారం ఏర్పాటు చేసిన గిరిజన దర్బార్‌లో భీమ్ పాల్గొన్నారు. గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను తెలుసుకొని సంబంధిత యూనిట్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏడీ భాస్కర్, ఉద్యానవనాధికారి అశోక్ కుమార్, డీటీఆర్ఓఎఫ్ ఆర్.శ్రీనివాస్, పవర్ ఏపీఓ పాషా, మేనేజర్ ఆదినారాయణ, గురుకులం, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షకులు కృష్ణార్జునరావు, ప్రమీల భాయ్, జేడీఎం హరికృష్ణ, హెచ్ఈఓ దుర్గయ్య పాల్గొన్నారు.

సామాజిక తనిఖీతో జవాబుదారీతనం



మాట్లాడుతున్న ఎంపీపీ ముక్తి సత్యం

గుండాల: సామాజిక తనిఖీతో నిధుల వినియోగం పారదర్శకంగా ఉంటుందని, కూలీల హక్కులకు రక్షణ కలుగుతుందని గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం గుండాలలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈజీఎస్ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల నుంచి వలసలు నివారించే లక్ష్యంతో ప్రభుత్వం ఉపాధి హామీ పనులు కల్పిస్తోందని, అవినీతికి అస్కారం లేకుండా పనులు సాగేలా చూడాలన్నారు. పంచాయతీల్లో ట్రాక్టర్ల నిర్వహణకు సంబంధించి ఎటువంటి రికార్డులు లేకుండా నిధులు డ్రా చేయడంపై అగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 2020 డిశంబర్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు రెండేళ్ల కాలంలో జరిగిన ఉపాధి పనులపై తనిఖీ చేపట్టారు. రూ.6.41 కోట్ల పనులు చేపట్టగా ఇందులో కూలీలకు రూ.4.83 కోట్లు, సామగ్రికి రూ.1.57 కోట్లు చెల్లించారు. గ్రామపంచాయతీల వారికి పనుల వివరాలు సభ ముందు ఉంచారు. హారితహారంలో నాటిన మొక్కలు 50శాతం మాత్రమే జీవించి ఉండగా.. టేకు, జామాయిల్ ప్లాంటేషన్‌లలో మొక్కలు లేకపోవటం, మస్టర్లలో సంతకాలు లేకుండా కూలీలకు వేతనాలు చెల్లింపులు, జాబ్ కార్డులు అప్‌డేట్ చేయకపోవటం, పనుల రిజిస్టర్లు నిర్వహించకపోవటం, తక్కువ పనికి ఎక్కువ కొలతలు చూపటం లాంటి లోపాలు గుర్తించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూ.77,836 జరిమానాలు విధిస్తున్నట్లు తెలిపారు. డీపీఓ రమణ, ఏపీఓ అనుష, ఎస్ఆర్పీలు నర్సయ్య, సతీష్, ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఓ రవితేజ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ప్రమాదాలను అప్రమత్తతతో నివారించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రాజు

మణుగూరురూరల్: సింగరేణి ఉద్యోగులు అప్రమత్తతతో పని చేస్తూ ప్రమాదాలను నివారించాలని జీఎం(సేఫ్టీ) కార్పొరేట్ గోపాల్‌రాజు సూచించారు. సోమవారం మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో పనిలో రక్షణ పాటించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జీఎం(సేఫ్టీ) కార్పొరేట్ గోపాల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గని ఏజెంట్ వీరభద్రరావు, గని మేనేజర్ వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణ అధికారి జె.వెంకటరమణ, గని రక్షణ అధికారి మధుబాబు, సీనియర్ అండర్ మేనేజర్ కె.బిందు సాగర్, సంక్షేమ అధికారి నరేష్, పిట్ సెక్రటరి ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ స్థలంపై వివాదం

అశ్వాపురం: రామచంద్రాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనం నిర్మిస్తున్న స్థలంపై వివాదం నెలకొంది. గ్రామంలో వాటర్‌ట్యాంక్ సమీపంలో ఉన్న భూమిలో గ్రామ పంచాయతీ కార్యాలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించగా రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో కార్యాలయం భవనానికి శంకుస్థాపన చేసి పనులు చేపడుతున్న నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న భూమి తమ పట్టా భూమి అంటూ ఓ వ్యక్తి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కోర్టును ఆశ్రయించాడు. దీంతో రెవెన్యూ అధికారులు పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని ఆపాలని, వేరే స్థలం కేటాయిస్తామని ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శికి తెలియజేశారు. అయినా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు భూమిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి ఇరువర్గాల వారు కూర్చొని సామరస్యంగా భూ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించినట్లు సమాచారం.

పాఠశాలల్లో 'వాయిస్ ఫర్ గర్ల్స్'



అంకంపాలెంలో విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీటీసీ, ఉపాధ్యాయులు

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం, దుర్గం గొల్లగూడెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో సోమవారం వాయిస్ ఫర్ గర్ల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంకంపాలెం బాలికల ఆశ్రమ పాఠశాలలో వాయిస్ ఫర్ గర్ల్స్– సఖీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. దుర్గం గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వాయిస్ ఫర్ గర్ల్స్– దిశ కార్యక్రమంలో గొల్లగూడెం, భీమునిగూడెం, అనంతారం, అశ్వారావుపేట, కావడిగుండ్ల గ్రామాల్లోని ఐదు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో విద్య ప్రాముఖ్యత, బాలికల ప్రాథమిక హక్కులు, ఆరోగ్యం, పరిశుభ్రత, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలను గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఎంపీపీ సోయం ప్రసాద్, హెచ్ఎంలు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, కోఆర్డినేటర్లు మౌనిక, మనీషా, రవళి, దీప్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని సోమవారం ఆ పార్టీ బాధ్యులు స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ వ్యక్తిగత, కుటుంబీకుల గురించి సోషల్ మీడియాలు పోస్టులు పెడుతున్న వారిపై పార్టీ ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో డేగల రాము, వినోద్, మల్లం రామకృష్ణ, మంగా దొడ్డి ఆనంద్, రాజేశ్,సాయి, తేజ ఉన్నారు.

జయప్రదం చేయండి

మణుగూరురూరల్: ఈ నెల 12వ తేదీన ఐక్య వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రేగళ్ల హరీష్ పిలుపునిచ్చారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అశ్వారావుపేటరూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 12న పాఠశాలలు, కళాశాల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

కొనసాగుతున్న సమ్మె



అశ్వారావుపేటరూరల్: సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు ఆరో రోజులుగా చేస్తున్న సమ్మె సోమవారం కొనసాగింది. ఆయా ప్రాంతాల్లోని దీక్షా శిబిరాన్ని నాయకులు సోమవారం సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయమైన గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను తక్షణమే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించి, ఉద్యోగ, ఆరోగ్య భద్రతలను కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

వాహన తనిఖీలు

మణుగూరురూరల్: మణుగూరులోని పూల మార్కెట్ సెంటర్ ప్రాంతంలో మణుగూరు ఎస్సై పురుషోత్తం తన సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. సంబంధించిత పత్రాలను, డ్రైవింగ్ లైసెన్సులను పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు ఈ–చలానా విధించారు.

దరఖాస్తు చేసుకోండి

దుమ్ముగూడెం: కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు, పోడు పట్టాలు వచ్చినవారు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. నేటి నుంచి ఆగస్టు 5 వరకు రైతులందరూ అయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఏఈఓలకు దరఖాస్తులను అందజేయాలని సూచించారు. పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డ్, దరఖాస్తు ఫారాలను సకాలంలో అందజేయాలని సూచించారు.

ఎస్‌ఓటూ జీఎంకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఓటు జీఎం ఈసం కృష్ణయ్యను ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు డీవీవీ సత్యనారాయణ, బి.రాజలింగు, టి.పెదనాగయ్య, తెప్ప శ్రీను, శ్యామ్‌వర్మ రాజు, పి.వీరభద్రం, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులు పరిశీలన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం గర్భగుడి నిర్మాణ పనులను సోమవారం ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పరిశీలించారు. ఆలయ నిర్మాణ కమిటీ వారితో మాట్లాడి పనుల వివరాలు తెలుసుకున్నారు. సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోడు పట్టాలు ఇవ్వాలి

దుమ్ముగూడెం: పెద్దనల్లబెల్లి గ్రామానికి చెందిన సుమారు 70 కుటుంబాల వారు తాము సాగు చేసుకుంటున్న పోడుకు హక్కు పత్రాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలను అందజేశారు. ఆదివారం రాత్రి పెద్ద నల్లబెల్లి గ్రామానికి భద్రాచలం పోదెం వీరయ్య రావడంతో ఆయనను స్థానికులు కలిసి తమకు పోడు పట్టాలు రాలేదని సమస్యలను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టర్, తహసీల్దార్, ఎంపీడీఓలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం వారు వినతిపత్రాలిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ కనుబుద్ది దేవా, నాయకులు లంక శివ, కణితి సమ్మయ్య, చంటి పాల్గొన్నారు.

విస్తరణను స్వాగతిస్తున్నాం

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో 8వ యూనిట్ విస్తరణను సీపీఎం స్వాగతిస్తోందని ఆ పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సారపాకలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీసీ పీఎస్‌పీడీ విస్తరణతో పలువురికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే అవకాశాలున్నాయన్నారు. పాపినేని సరోజిని, ఎస్‌కె.అబీదా, కౌలూరి నాగమణి, కమటం మరియమ్మ పాల్గొన్నారు.

ఐటీడీఏలో ఫిర్యాదు

దుమ్ముగూడెం: మండలంలోని పర్ణశాల గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగం చేసి పంచాయతీరాజ్ శాఖ చట్టానికి విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి గాదె ప్రసాద్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాపంథా దుమ్ముగూడెం మండల కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. పర్ణశాల గ్రామపంచాయతీ నిధులను కార్యదర్శి పక్కదోవ పట్టించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పీడీఎస్‌యూ డివిజన్ కన్వీనర్ శివ, ప్రశాంత్ పాల్గొన్నారు.

డీలర్‌షిప్‌కు అవకాశం

దమ్మపేట: మండల పరిధిలోని చౌక ధరల దుకాణల డీలర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సోమవారం తహసీల్దార్ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని మారప్పగూడెం, నాగుపల్లి, మందలపల్లి, రాచూరుపల్లి, సీతారాంపురం, వడ్లగూడెం, నాచారం గ్రామాల్లో ఉన్న చౌక ధరల దుకాణల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల కోసం షెడ్యూల్ తెగలు, స్వయం సహాయక సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అర్హత గలవారు ఈ నెల 18వ తేదీ లోపుగా దరఖాస్తులను తహసీల్ కార్యాలయంలో అందజేయాలని తెలియజేశారు.

శివాలయంలో పూజలు



ఆలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఎస్సై షాహీన

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో స్థానిక ఎస్సై షాహీన మొక్కలు నాటారు. పూజా కార్యక్రమాల్లో డీసీసీబీ మేనేజర్ నరసింహారావు, ఉపేందర్ రెడ్డి, శ్రీరామ రమేష్, జల్లెల రాము, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డిని కలిసిన సత్యవతి

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డిని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భద్రాద్రి డివిజన్‌లో పార్టీ అభివృద్ధిని సత్యవతి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి వివరించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలువబజార్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా మండలం రహదారులకు నోచుకోలేదని, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో సీసీరోడ్లు నిర్మింతమవుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, మైనార్టీ అధ్యక్షుడు షేక్ నయీం, జూపల్లి కిరణ్, రాయపూడి అశోక్, నరేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

చర్ల: బీఆర్ఎస్ పార్టీ చర్ల మండల ప్రధాన కార్యదర్శి నక్కినిబోయిన శ్రీనివాస యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆయన స్వగ్రామమైన గుంపెన్నగూడెంలో దశదిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్, పినపాక శాసన సభ్యుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ కార్యక్రమానికి హాజరై సంతాప సభలో మాట్లాడారు. పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్‌లోని సరోజిని వృద్ధాశ్రమానికి పట్టణంలోని వాణి ఫిల్లింగ్ స్టేషన్ యజమాని బాణోత్ వాణి నిత్యవసర వస్తువులను వితరణగా అందజేశారు. వృద్ధాశ్రమాన్ని ఆమె సోమవారం సందర్శించి సూమారు రూ.25 వేల విలువ గల నిత్యావసర వస్తువులతో పాటు సీలింగ్ ఫ్యాన్లను నిర్వాహకురాలు సరోజమ్మకి అందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



భద్రాచలంటౌన్: సమ్మె శిబిరంలో మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు విడుదల చేసి, కనీస వేతనం చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఆయా ప్రాంతాల్లోని ఎమ్మార్సీ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సమ్మె కొనసాగనుంది. సమ్మె శిబిరాన్ని సందర్శించిన పలువురు నాయకులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనం చెల్లించి పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌ను ఉచితంగా పంపిణీ చేసి కార్మికులకు ఐడీ కార్డు, యూనిఫామ్ అందజేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: సమ్మె వద్ద కార్మికులతో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు వెంకటనరసమ్మ



దమ్మపేట: విద్యా వనరుల కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న వంట కార్మికులు